హైదరాబాద్‌లో
కాక్రోచ్ జనతా పార్టీ నిరసన ప్రదర్శన

- విద్యావ్యవస్థలోని అవకతవకలను నిరసిస్తూ ధర్నాచౌక్ వద్ద భారీ ప్రదర్శన
- నీట్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

విశ్వంభర, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ.. హైదరాబాద్‌లో నిరసన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యావ్యవస్థలోని అవకతవకలను నిరసిస్తూ ధర్నాచౌక్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించింది. పర్యావరణవేత్త, ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులతోపాటు యువత పెద్దఎత్తున పాల్గొంది. నీట్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ''దేశంలో ఎంతో సంపద ఉంది. అదంతా ఎక్కడికి వెళ్తోంది? దేశంలో నిరుద్యోగ పరిస్థితి ఎందుకు నెలకొంది? యువతను కాక్రోచ్‌లుగా పేర్కొనడం ఏంటి? దేశంలో ఆరు శాతం మంది యువతకు మాత్రమే నైపుణ్యాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మరి మిగతావారికి అవి ఎందుకు అందటం లేదు? విద్యార్థులకు అన్యాయం చేసిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన్ను జైలుకు పంపాలి'' అని డిమాండ్ చేశారు.

యువజన సమ్మేళనం జయప్రదం చేయండి

విశ్వంభర, సరూర్ నగర్ : ఈ నెల16 ,17వ తేదీన కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రాం భవనంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే యువజన సమ్మేళనం ను విజయవంతం చేద్దామని సిపిఎం యన్ టి ఆర్ నగర్ శాఖ అధ్యక్షుడు యం గోపి నాయక్, సరూర్ నగర్ సర్కిల్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్ లు పిలుపునిచ్చారు. ఆదివారము యువజన సమ్మేళనం పోస్టర్ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్రప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన చేస్తామని చెప్పి చేయలేదని గుర్తుకు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేకపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి యాదవు, యండి ఖాతేజ, సార్వర్ మ్మేదిష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విశ్వంభర, మీర్ పెట్ : కాలనీ లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ధనవంతు కృషి చేస్తానని 58వ డివిజన్ ప్రశాంతి హిల్స్ కాంగ్రెస్ ఇంచార్జి నాయకులు, మీర్పేట జిహెచ్ఎంసి కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం అయోధ్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య నగర్ కాలనీ కమిటీ హాల్ దగ్గర కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం, దాదాపు పది , పదిహేను కాలనీ వాసులకు ఉపయోగపడే బాలాపూర్ చౌరస్తా నుంచి జనప్రియ మహానగర్ వెళ్ళు ప్రధాన రహదారి నిర్మాణ పనులు , మంచినీటి సమస్య, రోడ్లపై మట్టితో కూడిన చెత్తా చెదారం తొలగించుట, డ్రైనేజ్ సమస్యలు, విద్యుత్ సమస్యలు .ముఖ్యముగా కాలనీ ప్రక్కన ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థలంలో పెద్దపెద్ద చెట్లతో కూడిన స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న తీరు విధానాన్ని అసోసియేషన్ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తానని హామి ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ మాజీ అధ్యక్షులు మరియు ముఖ్య సలహాదారులు బళ్లారి శ్రీనివాసులు , మాజీ ప్రధాన కార్యదర్శి కూర రమేష్ , ప్రధాన కార్యదర్శి వేముల రాము , ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి , భాస్కర్ రావు , మహేందర్ గౌడ్ , కమిటీ సభ్యులు కాలనీవాసులు యాదగిరి , దర్శన్ గౌడ్ , ఉదయ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం

- ఉద్యమ ఆకాంక్షలు నెరవేరేవరకు పోరాడతాం: డా.కాచం
- ప్రశంసా పత్రాలు అందజేసిన సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కారులను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ పేర్కొన్నారు. ఉద్యమకారులకు అండగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురు ఉద్యమ కారులకు ఆయన ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కారుల సేవలను కొనియాడుతూ, వారి త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ఎన్నో సంవత్సరాల పాటు కొనసాగిందని, వేలాది మంది ప్రజలు తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాలను పక్కన పెట్టి ఉద్యమంలో పాల్గొన్నారని కాచం సత్యనారాయణ గుర్తు చేశారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. ఉద్యమ సమయంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, చేసిన త్యాగాలు ఎంతో గొప్పవని ఆయన అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఒక్క ఉద్యమ కారుడికి గుర్తింపు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యమ కారుల సంక్షేమం కోసం ప్రకటించిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ, ''తెలంగాణ ఉద్యమం ఒక చారిత్రాత్మక పోరాటం. ఈ పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలు అమూల్యమైనవి. ఉద్యమ కారులకు ప్రభుత్వం అందజేస్తానన్న సంక్షేమ పథకాలు, గుర్తింపు, గౌరవం అందరికీ చేరేలా మా సంఘం నిరంతరం కృషి చేస్తుంది. అర్హులైన ఉద్యమ కారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం'' అని అన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఏర్పాటుకు ప్రధాన ఉద్దేశ్యం ఉద్యమంలో పాల్గొన్న వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం, వారి కుటుంబాలకు అండగా నిలవడమేనని ఆయన వివరించారు. అనేక మంది ఉద్యమ కారులు నేటికీ తమ పోరాటానికి తగిన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారని, వారి వివరాలను సేకరించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యమ కారులు మాట్లాడుతూ తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని గుర్తించి గౌరవించడం ఆనందంగా ఉందని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారికి గుర్తింపు రావడం ద్వారా భవిష్యత్ తరాలకు తెలంగాణ సాధన చరిత్ర తెలియజేసినట్లవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, ఉద్యమ కారులు తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమం కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన అంశం కాదని, ప్రజల ఆకాంక్షలు, ఆత్మగౌరవం కోసం సాగిన ప్రజా ఉద్యమమని అభివర్ణించారు. ఉద్యమ కారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఉద్యమ సమయంలో పాల్గొన్న వారిలో చాలామంది ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి సంక్షేమ పథకాలు అందితే వారి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం తరఫున భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ఉద్యమ కారులను గుర్తించి గౌరవిస్తామని కాచం సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వారి సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ఉద్యమ కారులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పలువురు పేర్కొన్నారు. తెలంగాణ కోసం తమ వంతు పాత్ర పోషించిన వారిని గుర్తించడం సమాజ బాధ్యత అని, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో సాధారణ ప్రజల పాత్ర ఎంతో కీలకమని, వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ఉద్యమ కారులకు గౌరవం ఇవ్వడం ద్వారా వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయవచ్చని అన్నారు. ప్రశంసా పత్రాల ప్రదానం కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఉద్యమ కారుల సంక్షేమం కోసం సంఘం నిరంతరం పనిచేస్తుందని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చైర్మన్ కాచం సత్యనారాయణ తెలిపారు.

మహిళా అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం

అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేసి, మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారము నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి ఆధ్వర్యంలో సాగర్ రింగ్ రోడ్డు వద్ద ఒక ప్రైవేట్ హాల్ నందు నిర్వహించిన మహిళల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలే సమాజానికి వెన్నెముక అని, వారి అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని అన్నారు.మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, పార్టీ బలోపేతానికి మహిళా నాయకురాళ్లు మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మహిళలు ముందుండి పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని సుధీర్ రెడ్డి పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మనాయక్ , మల్లీశ్వరి ,డివిజన్ల మహిళ అధ్యక్షురాళ్లు నాగలక్ష్మి,లత,ఆదిలక్ష్మి,కొసనం ధనలక్ష్మి ,అంజలి గౌడ్, శైలజ, శిల్పారెడ్డి, విజయ, రమాదేవి, కల్పన, శోభా, పావని, దేవి, ఉమా దేవి, విజయ లక్ష్మి, మేరీ, ప్రభావతి ఉద్యమకారులు కళపూర్ణ, వరలక్ష్మి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆజ్ఞలను మోడీ పాటిస్తున్నారు: రాహుల్

విశ్వంభర, ఢిల్లీ: అమెరికా దాడుల్లో భారతీయ నావికులు మరణించడంపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులపై ప్రధాని మోడీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. అగ్రరాజ్యం ఆంక్షలకు ఆయన లొంగిపోయారంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా దాడులు చేయడంతో ముగ్గురు దేశీయ నావికులు మరణించిన సంగతి తెలిసిందే. దాడులపై నిరసన తెలియజేస్తూ భారత విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ అమెరికా సెక్రటరీ మార్క్ రూబియోతో మాట్లాడారు. ఈ క్రమంలోనే వాణిజ్య నౌకలు యూఎస్ మిలిటరీ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని, ఇరాన్‌పై ఉన్న అమెరికా దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తే సహించబోమని రూబియో అన్నారు. ఈ వ్యాఖ్యలను రాహుల్ ప్రస్తావిస్తూ.. 'అమెరికా ఆదేశాలను ఏ దేశం సహించదు. కానీ మన రాజీపడ్డ ప్రధాని అగ్రరాజ్యం ఆంక్షలకు లొంగిపోయారు. విదేశీ అధికారం భారత పౌరులను చంపేస్తున్నా ప్రధాని ఆ దేశ ఆజ్ఞలను పాటిస్తూ విధేయత కనబరుస్తున్నారు. వారి దాడుల్లో భారత నావికులు మరణించినా అమెరికా ఇప్పటికీ పశ్చాత్తాపపడడం లేదు. అదనంగా ఆంక్షలకు కొనసాగిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్ చర్చకు రావాలి: రామచందర్‌రావు

విశ్వంభర, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కుటుంబమే బాగుపడిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. అంబర్‌పేటలో నిర్వహించిన భాజపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.''జీహెచ్ఎంసీ మూడు కార్పొరేషన్లు అయింది. 3 కార్పొరేషన్లలో భాజపా గెలిస్తే అభివృద్ధి జరుగుతుంది. కాంగ్రెస్ సర్కార్ పంట కొనుగోలు చేయకపోతే ఒత్తిడి తీసుకొచ్చాం. పండిన పంటలో కేంద్ర ప్రభుత్వం సగం కంటే ఎక్కువే కొనుగోలు చేసింది. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలి. సీఎం వస్తే సచివాలయం ఎదురుగా గణాంకాలతో వివరిస్తా. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి భాజపాను ఓడించాలని చూస్తున్నాయి'' అని రామచందర్‌రావు అన్నారు.

ఘనంగా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్

ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల

విశ్వంభర, నాగోల్ : నగరంలోని బండ్లగూడ నాగోల్ ప్రాంతంలో నిర్వహించిన ఉమెన్స్ సైక్లింగ్ - సిటీ లీగ్ 2026 (హైదరాబాద్ ఎడిషన్) కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం మహిళల సాధికారత, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందింపుకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, క్రీడల్లో కూడా విశేష ప్రతిభ కనబరుస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని అన్నారు.యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవడానికి సైక్లింగ్ వంటి క్రీడలు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు.మహిళా సైక్లిస్టుల ఉత్సాహాన్ని అభినందించిన ఆయన, ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల మరింత ఆసక్తిని కలిగిస్తాయని తెలిపారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం, క్రీడా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నల్ల జ్యోతి కుమార్ , సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ప్రాంతీయ డైరెక్టర్,శాంతి ప్రియా , ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, ఆంధ్రప్రదేశ్, యాదయ్య , క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ యేడాది నుంచే ప్రీ ప్రైమరీ

విశ్వంభర: హైదరాబాద్ : ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుండే మొదలవుతుంది. తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తమ పరిధిలోని 20 పాఠశాలల్లో అమలు చేయనున్నామని రాజేంద్రనగర్ ఎమ్. ఈ.ఓ (మండల విద్యాశాఖ అధికారి) కేశవత్ శంకర్ రాథోడ్ తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యా విధానం ప్రభుత్వ పాఠశాలలో లేని కారణంగా ప్రైవేటీ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు సిద్ధమవుతున్న కుటుంబ సభ్యులకు తల్లిదండ్రులకు ఇది ఒక శుభవార్తగా చెప్పుకోవచ్చు అని ఆయన తెలిపారు. రాజేంద్రనగర్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో అత్తాపూర్ హైదర్గూడా బుద్వేల్ మైలార్దేవ్‌పల్లి పద్మశాలి పురం బాబుల్ రెడ్డి నగర్ దుర్గా నగర్ ఎర్రబోడ గణేష్ నగర్ లక్ష్మీగూడా మధుబన్ కాలనీ లక్ష్మీగూడా నేతాజీ నగర్ మధుబన్ కాలనీ నేతాజీ నగర్ రాంబాగ్ వీరాంపల్లి శ్రీరామ్ నగర్ ఉప్పరపల్లి ఎన్టీఆర్ నగర్ సులేమాన్ నగర్ గగన్ పాడు యుపిఎస్ జెబి నగర్ ఉర్దూ మీడియం గుర్తింపు పొందిన ఈ 20 పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని ప్రారంభించ నున్నట్లు ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజులను భరించలేని కుటుంబాలు ఆయా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఆయన సూచించారు. నర్సరీ ఎల్కేజీ యూకేజీ చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందించే మెరుగైన సౌకర్యాలు అందిస్తామని ఆయన వివరించారు.

11 తులాల బంగారం, రెండు కిలోల వెండి, నగదు చోరీ

విశ్వంభర , ఎల్బీనగర్ : ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డ ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ లో నివాసం ఉండే పాలెం అశోక్ కుమార్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 9వ తేదీన వారి సొంత గ్రామం నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం అగ్రహారం గ్రామానికి వెళ్ళాడు. ఈనెల 13వ తేదీన సాయంత్రం 6 గంటలకు తిరిగి మోహన్ నగర్ కు రాగా ఇంటి మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపటికి వెళ్లి చూడగా బీరువా తాళాలు కూడా పగలగొట్టి అందులోని 11 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.50 లక్షల నగదును దోచుకెళ్ళారు. తన ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కెమెరాకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువజన సమ్మేళనం సభా వేదికను పరిశీలించిన జాన్ వెస్లీ

విశ్వంభర, సరూర్ నగర్ : భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీలలో యువజన సమ్మేళనం రెండు రోజుల సదస్సులు ఉంటాయి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. యువజన సమ్మేళనం జరగనున్న కొత్తపేట బీజెఆర్ భవన్ సభా వేదికను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు జిల్లా, ఎల్బీనగర్ నాయకులు ఆదివారం పరిశీలించారు. సిపిఎం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువజన సమ్మేళనం కార్యక్రమానికి సిపిఎం అగ్ర నాయకులు హాజరు కానున్న నేపథ్యంలో సభా వేదిక సౌకర్యాలు, పార్కింగ్ ఏర్పాట్లను సిపిఎం అనుబంధ సంఘాల నేతలు బీజెఆర్ భవన్ ను సందర్శించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాజ్యసభ సభ్యులు రహీమ్ తదితరులు యువజన సమ్మేళనం సభకు హాజరు కానున్నారు. దేశంలో సుమారు 40 కోట్ల మంది యువతీ యువకులు ఉన్నారని భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. పాలకులు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపకుండా దేశభక్తి, దైవభక్తి పేరుతో మతోన్మాదం వైపు యువతను ప్రేరేపిస్తున్నారు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్ల ప్రభుత్వ ఉద్యోగులు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పటి వరకు ఎన్ని కోట్ల మంది యువతకు ఉద్యోగావకాశాలు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. పన్నెండు ఏళ్లు పాటు కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటి వరకు 24 కోట్ల ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు ఇచ్చి ఉండాలి కదా అని జాన్ వెస్లీ పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఆ లెక్కన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు ఎన్ని లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చారు అని ఆయన నిలదీశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను దారుణంగా మోసం చేస్తున్నాయని జాన్ వెస్లీ ఆరోపించారు. యువతను సరైన మార్గంలో పెట్టడానికి సంఘిటితం చేయడానికి జూన్ 16, 17 తేదీలలో కొత్తపేట బీజెఆర్ భవన్ లో యువజన సమ్మేళనం జరుగుతుంది అని ఆయన వివరించారు. రాజకీయ చైతన్యం అధికంగా ఉండే ఎల్బీనగర్ ప్రాంతంలో యువతి ప్రగతిశీల భావాలతో ఉంటారని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అభిప్రాయపడ్డారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా విశ్వంభర
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108